


మున్నేరు బ్రిడ్జిపై చిక్కుకున్న తొమ్మిదిమంది


మణుగూరు సుందరయ్యనగర్‌లో వరద ముంపు


ఖమ్మం మున్నేరు ఉధృతి

జల విలయం


వాగుమల్లారంలో వృద్ధురాలిని తీసుకొస్తున్న సీఐ సతీష్‌కుమార్, వలంటీర్లు


సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న మంత్రి తుమ్మల

- పలు గ్రామాలను ముంచెత్తిన వరదనీరు
- హైదరాబాదు, విజయవాడవైపు నిలిచిన రాకపోకలు
- కూసుమంచిలో అత్యధికంగా 31.5 సెం.మీ వర్షపాతం
- తిరుమలాయపాలెంలో 54మందిని రక్షించిన ఎన్డీఆర్‌ఎఫ్
- 39పునరావాస కేంద్రాలకు 7,090 మంది తరలింపు
- కూసుమంచి వద్ద సాగర్‌కాలువకు గండి
- మున్నేరు రికార్డుస్థాయిలో 36అడుగులతో ప్రవాహం
- ఖమ్మం ప్రకాష్‌నగర్ బ్రిడ్జిపై చిక్కుకున్న 9మంది
- రాత్రి 11గంటలకు సురక్షితంగా బయటికి

ఉమ్మడి జిల్లాను ముంచెత్తిన వరదలు

ఖమ్మం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): బంగాళాఖాతంలో వాయు గుండం ప్రభావంతో శనివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారే వరకు కురిసిన భారీ వర్షాలతో ఖమ్మం జిల్లాను వరదలు చుట్టుముట్టాయి. పలు వాగులు, ఏర్లు పొంగి ప్రవహించడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. పలుగ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఖమ్మం నగరం వద్ద మున్నేరుకు రికార్డుస్థాయిలో 36 అడుగుల వరద రావడంతో ఖమ్మం నగరం జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఆదివారం ఉదయం వరకు కూసుమంచి మండలంలో రికార్డు స్థాయిలో 31.5సెం.మీ వర్షం కురిసింది. జిల్లాలో సగటున 19.6. సెం.మీ వర్షపాతం నమోదైంది. మధిరలో 28 సెం.మీ వర్షం కురిసింది. శనివారం నుంచి కురిసిన భారీ వర్షాలకు పాలేరు జలాశయానికి భారీగా వరద పోటెత్తింది. కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద పాలేరు వరదలో చిక్కుకుని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గల్లంతయ్యారు. వారిలో ఒకరిని కూసుమంచి పోలీసులు రక్షించారు. ఆదివారం ఉదయం నాయకన్‌గూడెం గ్రామంలో పెట్రోల్ బంకు పక్కన నివాసం ఉంటున్న షేక్ యాఖుబ్ ఇంటిని పాలేరు అలుగు నీరు చుట్టుముట్టింది. దీంతో తమ ప్రాణాలు కాపాడుకునేందుకు షేక్ యాఖుబ్ (48), అతడి భార్య సైదాబి (45), కుమారుడు షరీఫ్ ఇంటిపైకి ఎక్కారు. వరదలో చిక్కుకున్నారన్న సమాచారం తెలుసుకున్న అధికారులు వారిని కాపాడేందుకు రెస్క్యూ టీం, పోలీసులు ప్రయత్నించారు. కానీ వరద ఉధృతికి వీలుపడలేదు. దీంతో డ్రోన్ల సాయంతో సేఫ్టీ జాకెట్లను అందించారు. ఈ క్రమంలో వరద ఉధృతి పెరిగి ఇంటిగోడ కూలడంతో యాఖుబ్, అతడి భార్య సైదాబీ, కుమారుడు షరీఫ్ గల్లంతయ్యారు. కిలోమీటర్ దూరంలో ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై ఉన్న కానిస్టేబుల్ రాంబాబు వారిని గమనించి వెంటనే తాళ్లసాయంతో యాఖుబ్ కుమారుడు షరీఫ్‌ను రక్షించాడు. యాఖూబ్, సైదాబీ నీటిలో గల్లంతయ్యారు. వారికోసం గాలింపు కొనసాగుతోంది. కాగా మధిర మండలం దెందుకూరులో గేదెలను మేతకు తోలుకెళ్లిన పద్మావతి (34)అనే మహిళ శనివారం వరదలో కొట్టుకుపోగా రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద ఆదివారం ఆమె మృతదేహం లభించింది. ఎర్రుపాలెం మండలం భవానిపురానికి చెందిన మనిశెట్టి సాంబశివరావు(20) శనివారం స్థానిక భీమవరం వాగులో గల్లంతు కాగా ఆదివారం అతడి మృతదేహం లభించింది.

మున్నేరుకు ఆకస్మికంగా వరద

ఎగువన కురిసిన వర్షాలతో ఖమ్మం సమీపంలోని మున్నేరుకు భారీగా వరద చేరింది. ఉదయం 22 అడుగులు ఉన్న మున్నేరు సాయంత్రం 36 అడుగులకు చేరింది. మున్నేరుకు ఇది రికార్డు స్థాయి వరదగా నమోదైంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మున్నేరుకు వరద రావడంతో పరివాహక ప్రాంతాల్లోని తిరుమలాయపాలెం, కూసుమంచి, ఖమ్మంరూరల్, రఘునాథపాలెం, ఖమ్మం నగరం చింతకాని, ముదిగొండ, బోనకల్ తదితర మండలాల్లోని గ్రామాలు వేల ఎకరాల పంటలు జలమయమయ్యాయి. ఆకేరు కూడా భారీగా పొంగి ప్రవహించింది. ఖమ్మం నగరంలోని కవిరాజ్ నగర్, రాపర్తినగర్, బొక్కలగడ్డ, పద్మావతినగర్, వెంకటేశ్వనగర్, వీడియోస్‌కాలనీ, చైతన్యనగర్, ధంసలాపురం, ఖానాపురం, ఖమ్మం రూరల్ మండలంలోని కరుణగిరి, జలగంనగర్, రాజీవ్‌గృహకల్ప, పోలేపల్లి తదితర గ్రామాల్లో కూడా నీరు ముంచెత్తింది.

39 పునరావాస కేంద్రాలకు 7,090మంది తరలింపు

భారీవర్షాల నేపథ్యంలో జిల్లాలో 39 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి 7,090 మందిని తరలించారు. ఖమ్మం అర్బన్‌లో అత్యధికంగా ఐదు సెంటర్లు ఏర్పాటుచేసి 5,750మందిని తరలించారు. ఇందులో జీహెచ్‌ఎస్ రామన్నపేటలో 1,500మంది, స్వర్ణభారతి ఫౌండేషన్‌లో 750మంది, జూబ్లీక్లబ్‌లో 250మంది. ఉమెన్స్‌కాలేజీలో 2,500మంది, యూపీఎస్ ధంసలాపురంలో 750 మందిని తరలించారు. చింతకాని మండలం బొప్పారంలో 150మంది, కూసుమంచి మండలంలో 7 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 698 మందిని, మధిర పట్టణంలో రెండు పునరావాస కేంద్రాల్లో 110మందిని, సత్తుపల్లిలోని వేంసూరు ఎస్సీ హాస్టల్‌లో 12మందిని, వేంసూరు ఎస్సీ హాస్టల్‌లో 18మందిని, వైరా బాలికల హాస్టల్‌లో 20మందిని, ఎర్రుపాలెం మండలంలో 332మందిని తరలించారు. వీరందరికి భోజన, వసతి సౌకర్యం కల్పించారు.

'తిరుమలాయపాలెం'లో 54మందిని కాపాడిన ఎన్డీఆర్‌ఎఫ్

తిరుమలాయపాలెం మండలంలో ఆకేరు నదికి వరద ఉధృతంగా రావడంతో ఆదివారం ఉదయాన్నే రాకాసీ తండాను వరద చుట్టుముట్టింది. దీంతో గ్రామస్థులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లగా కొందరు డాబాలపై చేరగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్ దత్ ఆధ్వర్యంలో ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు పంపించి స్పీడ్‌బోట్లతో వారిని సురక్షితంగా తరలించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అందరిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు.

విజయవాడ, హైదరాబాద్‌కు నిలిచిన రాకపోకలు

ఖమ్మం మీదుగా రాజధాని హైదరాబాద్, విజయవాడలకు రాకపోకలు పూర్తిగా నిలిచాయి. దీంతో ఖమ్మంలో పలు లారీలు, బస్సులు నిలిపివేశారు. ఖమ్మం మీదుగా మున్నేరు ప్రవాహం పెరగడంతో బైపాస్‌లోని మున్నేరు బ్రిడ్జినుంచి రాకపోకలు నిలిపివేశారు. పాలేరు జలాశయానికి రికార్డుస్థాయిలో వరదనీరు పోటెత్తింది. రాత్రికి రాత్రే పెద్దఎత్తున వరద వచ్చి చేరింది. దీంతో అనూహ్యంగా శనివారం రాత్రి 21.5 అడుగులు నీరున్న పాలేరు.. తెల్లారేసరికి 27 అడుగులకు చేరింది. పాలేరు, నాయకన్‌గూడెం గ్రామాల్లో జలాశయం లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనలకు గురై వెంటనే ఇళ్లను ఖాళీచేసి బయటకు వచ్చారు. పాలేరు అలుగుల ద్వారా వస్తున్న నీరు ఖమ్మం-సూర్యాపేట ప్రధానరహదారి పైనుంచి వరదనీరు భయంకరంగా ప్రవహించడంతో పోలీసులు ఆదివారం ఉదయంనుంచి రాకపోకలు నిలిపివేశారు. కొందరు ముదిగొండ, నేలకొండపల్లి మీదుగా కోదాడనుంచి హైదరాబాద్‌కు మధ్యాహ్నం వరకు ప్రయాణాలు కొనసాగినా.. ఆ తర్వాత నిలిపివేశారు. కాగా ఖమ్మంలో మున్నేరు బైపాస్ బ్రిడ్జి చెంతకు మున్నేరు వరద చేరడంతో మున్నురు బ్రిడ్జి ఊగింది. బిడ్జికి కొంత పగుళ్ల రావడంతో సాయంత్రంనుంచి రాకపోకలను నిలిపివేశారు. మధిరనుంచి బోనకల్, మధిరనుంచి పెనుగంచిపోలువైపు రోడ్లపై నీరు చేరడంతో విజయవాడ వైపు వెళ్లే వాహనాలు నిలిపివేశారు. విజయవాడ, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వద్ద రైల్వే ట్రాక్ దెబ్బతినడంతో ఖమ్మంమీదుగా రైళ్ల రాకపోకలు నిలిపివేశారు. మధిరలో నిలిచిన పలు రైళ్లను వెనక్కి మళ్లించారు.

సాగర్ ఎడమకాల్వకు రెండుచోట్ల గండి

కూసుమంచి మండలంలో సాగర్ ఎడమకాల్వకు పాలేరు జల విద్యుత్ కేంద్రం వద్ద, (మిగతా 6వ పేజీలో)


వరద పరిస్థితిని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి, ఎంపీ


మధిరలో వైరానది


తెగిపోయిన నేరడ-చింతకాని రహదారి

మున్నేరు బిడ్జిపై చిక్కుకున్న 9మంది

- సుమారు 10గంటలు గడిపిన బాధితులు
- వారిని రక్షించేందుకు హెలీకాప్టర్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన ముగ్గురు మంత్రులు 6
- రాత్రి 11గంటలకు సురక్షితంగా బయటకు..
- సహాయక చర్యలను పర్యవేక్షించిన మంత్రి తుమ్మల

మణుగూరును ముంచేసిన వరద

- ఉగ్రరూపం దాల్చినకోడిపుంజుల వాగు, కట్టువాగు
- మునిసిపాలిటీ ప్రాంతమంతా ముంపునకు గురి
- పలుచోట్ల కూలిన ఇళ్లు.. ప్రహరీ గోడలు
- సహాయక చర్యల్లో పోలీసు రెవెన్యూ సిబ్బంది
- రెండు పునరావాస కేంద్రాల్లో 400 మంది 7


జలమయమైన ఖమ్మంలోని కాల్వొడ్డు ప్రాంతం

కుటుంబాన్ని కాపాడేందుకు ప్రయత్నించాం..
కానీ దురదృష్టకరం

- భావోద్వేగానికి గురైన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పాలేరు వరదలో గల్లంతైన కుటుంబ సభ్యులకు ఓదార్పు
- బాధిత కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని హామీ 6

పెదవాగు ప్రాజెక్టు రింగ్‌బండ్‌కు గండి

- భారీ వరదతో నెలరోజుల్లోనే రెండోసారి గండి
- రూ.మూడున్నర కోట్లు నీటిపాలు


అశ్వాపల్లి మండలంలో సంపత్‌నగర్ వద్ద కోతకు గురైన రోడ్డు

ఇరు జిల్లాల్లో ఐదుగురు మృతి

- మరో ఇద్దరు గల్లంతు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గురువారం భారీ వర్షాలు వరదలతో ఐదుగురు మృతి చెందగా ఇద్దరు గల్లంతయ్యారు. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం వెంకటాపురం పంచాయతీ సాయిబులగుంపు గ్రామానికి చెందిన ఇద్దరు వృద్ధులు కల్లూరి నీలమయ్య(70), తాటి ఆదెమ్మ(68) వాగులో కొట్టుకుపోయి మృతి చెందారు. మణుగూరులోని సుందరయ్యనగర్ ప్రాంతంలో నివాసముండే నందికోళ్ల రాము (30)వికలాంగురాలు వరదలో మునిగి మృతిచెందింది. కాగా ఖమ్మం జిల్లా మధిర మండలం దెందుకూరులో శనివారం గేదెలను మేతకు తోలుకెళ్లిన పద్మావతి (34) అనే మహిళ వాగు వరదలో గల్లంతవ్వగా ఆదివారం ఆమె మృతదేహం రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద లభించింది. ఎర్రుపాలెం మండలం భవానిపురానికి చెందిన మనిశెట్టి సాంబశివరావు(20) శనివారం స్థానిక భీమవరం వాగులో గల్లంతు కాగా ఆదివారం అతడి మృతదేహం లభించింది. ఇదిలా ఉండగా ఖమ్మం జిల్లా నాయకన్‌గుడెం వద్ద పాలేరు వరదలో షేక్ యాఖుబ్(48), అతడి భార్య సైదాబి(45) గల్లంతయ్యారు. వారి ఆచూకీ లభించలేదు.

వరదల వేళ డ్యూటీకి రాకపోతే ఎలా..

- గౌర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వండి
- వరద ప్రాంతాలను పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి

మధిరటౌన్, సెప్టెంబరు 1: వరదలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే అధికారులు ఆదివారం అని డ్యూటీకి రాకుంటే ఎలా అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులకు గౌర్హాజరైన అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని జిల్లా అధికారులను ఆదేశించారు. మధిర పట్టణంలో ఆదివారం ఆయన వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్ సర్కిల్ వద్ద నాలా ఆక్రమణకు గురైన విషయాన్ని స్థానికులు భట్టి దృష్టికి తీసుకెళ్లగా మునిసిపల్ ఏఈని పిలవాలని సూచించగా ఆదివారం అని ఆయన రాలేదని కమిషనర్ సమాధానం ఇవ్వడంతో వరదల వేళ అధికారులంతా అందుబాటులో ఉండాలని ఎందుకు రాలేదని ప్రశ్నించారు. రాని వారందరికీ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఆయన వరద ప్రాంతాలను పరిశీలించారు. భట్టి పర్యటనలో వైరా ఏసీపీ రెహ్మాన్, మధిర సీఐ మధు, టౌన్ ఎస్ఐ సంధ్య బందోబస్తు పర్యవేక్షించగా.. కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, కమిషనర్ షఫీఉల్లా, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


వైఎస్‌ఆర్ సర్కిల్ వద్ద నాలా ఆక్రమణను పరిశీలిస్తున్న భట్టి

నేడు విద్యాసంస్థలకు సెలవు

ఖమ్మం ఖానాపురం హవేలి, సెప్టెంబరు 1: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాలతో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల విద్యాసంస్థలకు సోమవారం సెలవును ప్రకటించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాలని, మండల విద్యాశాఖ అధికారులు మీమీ పరిధిలోని అన్ని యాజమాన్యాలకు ఆదేశాలు చేరవేసి అమలు చేయాలని డీఈవో తెలిపారు.

రోడ్డెక్కని 208 బస్సులు

- రూ. కోటి 20లక్షల ఆదాయం కోల్పోయిన ఆర్టీసీ 6


పాల్వంచ మండలంలో ముంపునకు గురైన వరి


జూలూరుపాడులో వర్షపు నీటిలో మునిగిన మిరప


అలుగుపారుతున్న పాలేరు రిజర్వాయర్


నాయకన్‌గూడెం వద్ద సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్న కలెక్టర్

కన్నీటి వరద

- ఇరుజిల్లాల్లో కుంభవృష్టి
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- తెగిన రహదారులు
- రాకపోకలకు అంతరాయం
- నీటమునిగిన పంటలు

బంగాళాఖాతం వాయుగుండం ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో జిల్లాలోని పలు వాగులు, ఏర్లు పొంగి ప్రవహించాయి. లోతట్టుప్రాంతాలు జలమయం అయ్యాయి. పలుచోట్ల రహదారులు తెగిపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పాలేరు వాగు పొంగి ప్రవహించడంతో నాయకన్‌గూడెం వద్ద జాతీయ రహదారిపైకి వరద నీరు రావడంతో కొద్దిసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.


పెనుబల్లి బ్రిడ్జిని పరిశీలిస్తున్న భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు


రాజీవ్‌గృహకల్ప వరద బాధితులతో మాట్లాడుతున్న ఎంపీ రఘురాంరెడ్డి


చింతకాని మండలం రేపల్లెవాడలో కోడి పిల్లల మృత్యువాత


కిష్టారం-చెరుకుపల్లి మధ్య ప్రవహిస్తున్న ముగ్గువాగు


ఖమ్మం బైపాస్‌లో నీటమునిగిన సబ్‌స్టేషన్


మణుగూరు మండలం వాగుమల్లారం గ్రామస్థులను తరలిస్తున్న సీఐ


ఖమ్మం 41వ డివిజన్‌లో ఇంట్లోకి వచ్చిన వరద నీరు


వరదలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న పంచాయతీ అధికారులు


బూర్గంపాడు మండలం ఉర్లదోసపల్లిలో మృతిచెందిన పశువులు


చింతకాని మండలం రాఘవాపురంలో వర్షానికి కూలిన ఇళ్లు

కుటుంబాన్ని కాపాడేందుకు ప్రయత్నించాం..

కానీ దురదృష్ణకరం: మంత్రి పొంగులేటి

● బాధిత కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని హామీ

కూసుమంచి, సెప్టెంబరు 1: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం గ్రామంలో గల్లంతైన యాకుబ్ కుటుంబాన్ని కాపాడేందుకు ప్రయత్నించినా కాపాడలేకపోయినట్లు రెవెన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. హైదరాబాద్‌నుంచి ఖమ్మం వెళుతూ ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై నాయకన్‌గూడెం వద్ద ఆదివారం సాయంత్రం పాలేరు వరద ఉధృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన షేక్ యాఖుబ్, అతడి భార్య సైదాబీ గల్లంతైన విషయం తెలుసుకొని అక్కడ వేచిఉన్న యాఖుబ్ సోదరుడు లాల్‌సాబ్, ఇతర కుటుంబసభ్యులను మంత్రి కలిశారు. ఈ సందర్భంగా తీవ్ర భావోద్వేగానికి గురైన మంత్రి యాఖుబ్ కుటుంబ సభ్యులను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించినట్లు తెలిపారు. నేవీకి, డిఫెన్స్, హకీంపేట ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన హెలీకాప్టర్‌లను రప్పించేందుకు తీవ్రంగా ప్రయత్నించామని అయినా వాతావరణం అనుకూలించకపోవడంతో వారు ముందుకు రాలేదని తెలిపారు. దీంతో మోతే నుంచి డ్రోన్‌లను తెప్పించి లైఫ్‌జాకెట్లు తెప్పించేందుకు ప్రయత్నించినట్లు వివరించారు. టెలీకాన్ఫరెన్స్‌లో వాళ్లతో మాట్లాడేందుకుకు కూడా ప్రయత్నించానని, ఆ సమయంలో వాళ్ల ఆవేదన వర్ణనాతీతంగా ఉందన్నారు. తాను మాట్లాడుతున్న సమయంలోనే గోడకూలిపోవడంతో వారంతా గల్లంతయ్యారన్నారు. లైఫ్ జాకెట్లు ఉన్నందున వాళ్లు క్షేమంగా తిరిగిరావాలని కోరుకుటుంటున్నానని మంత్రి తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.


పాలేరు వరదలో గల్లంతైన యాకుబ్ సోదరుడు లాల్‌సాహెబ్‌ను ఓదారుస్తున్న మంత్రి పొంగులేటి

రోడ్డెక్కని 208 బస్సులు

● రూ. కోటి 20లక్షల ఆదాయం కోల్పోయిన ఆర్టీసీ


బస్సులు లేక బస్టాండ్‌లో ప్రయాణికులు

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు 1: భారీవర్షాలకు ఆర్టీసీకి బారీ నష్టం వాటిలింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి జిల్లాలోని పలు రూట్లకు సర్వీసులు బంద్ కావటంతో రూ. కోటి 20లక్షల వరకు ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మొత్తం 208 బస్సులను డిపోలకే పరిమితమయ్యాయి. ఖమ్మం డిపో నుంచి పాలేరు, నాగులవంచ, కిష్టాపురం, పేరేపల్లికి రోడ్‌లు బ్లాక్ కావటంతో, బారీ వర్షాలకు సూర్యపేట, విజయవాడ, కోదాడ, బోనకల్, జగ్గయపేట, మాధారం, హైద్రాబాద్ రూట్లు పూర్తిగా బంద్ చేశారు. కొత్తగుడెం, భద్రాచలం, మణుగురు, ఇల్లెందు, మధిర రూట్లలో బస్సులు పాక్షికంగా నడిసాయి. రీజియన్ పరిధిలో మెత్తం 252 బస్సులు పాక్షికంగా నడిపారు. ఆదివారం అర్ధరాత్రి వరకు బస్సులు నడిసే పరిస్థితి లేదని , సోమవారం ఉదయం పరిస్థితిని బట్టి సర్వీసులు నడిపిస్తామని రీజనల్ మేనేజర్ సరిరాం తెలిపారు.

జలవిలయం

(5వ పేజీ తరువాయి)

మల్లాయిగూడెం వద్ద రెండుచోట్ల గండిపడింది. జలవిద్యుత్‌కేంద్రం కాల్వలో నీటిప్రవాహం ఎక్కువ కావడంతో కాల్వకు గండిపడింది. మల్లాయిగూడెం వద్ద 15అడుగుల వెడల్పులో మరో గండిపడింది.

వరదలపై మంత్రుల పర్యవేక్షణ

ఖమ్మం జిల్లాలో వరదల పరిస్థితిపై డిప్యూటీ సీఎం భట్టి వక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. భట్టి విక్రమార్క ఖమ్మం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అధికారులను అప్రమత్తం చేశారు. మధిర, ఖమ్మం నియోజకవర్గాల్లో భట్టి పర్యటించారు. వ్యవసాయాశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం సాయంత్రం ఖమ్మంరూరల్ మండలం కరుణగిరికి చేరుకుని బాధితులను పరామర్శించారు. అనంతరం ఖమ్మంనగరంలో వరద ప్రాంతాల్లో పర్యటించారు. పునరావాస కార్యక్రమాలు వేగవంతం చేయాలి ఆదేశించారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హైదరాబాదు నుంచి వచ్చి వరద సహాయక చర్యలను పర్యవేక్షించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునిల్‌దత్ ఆధ్వర్యంలో జిల్లాలో వరద సహాయ కార్యక్రమాలు, రెస్క్యూ ఆపరేషన్స్ నిర్వహిస్తున్నారు.

నీటి పాలైన పంటలు

జిల్లాలో కురిసిన వర్షాలు, పొంగిన వరదల కారణంగా సుమారు లక్ష ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. వరి, పత్తి, మిర్చి, పంటలతో పాటు కూరగాయల పంటలు కూడా నీటమునిగాయి. తిరుమలాయపాలెం, రఘునాధపాలెం, కారేపల్లి, కామేపల్లి, కూసుమంచి, ఖమ్మంరూరల్, చింతకాని, బోనకల్, మధిర, ముదిగొండ, ఎర్రుపాలెం, కొణిజర్ల, వైరా తదితర మండలాల్లో పంటలకు నష్టం జరిగింది. భారీవర్షాలతో పంట పొలాలతోపాటు ఇళ్లుకూడా దెబ్బతిన్నాయి.

పెదవాగు ప్రాజెక్టు రింగ్‌బండ్‌కు గండి

● భారీ వరదతో నెలరోజుల్లోనే రెండోసారి గండి ● రూ.మూడున్నర కోట్లు నీటిపాలు


పెదవాగు ప్రాజెక్టుకు గండిపడిన దృశ్యం

అశ్వారావుపేట/ములకలపల్లి, సెప్టెంబర్ 1: భారీ వర్షాలతో భద్రాద్రి జిల్లా పెదవాగు ప్రాజెక్టు 'రింగ్ బండ్'కు భారీ గండి పడింది. వానాకాలం సీజన్ ప్రారంభంలో జూన్ 18న కురిసిన భారీ వర్షాలతో పెదవాగుప్రాజెక్టు కట్టకు భారీ గండి పడింది. దాంతె రైతులకు ఈ ఏడాది తాత్కాలికంగా నీరందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మూడున్నర కోట్లు వెచ్చించి రింగ్‌బండను నిర్మించింది. రెండురోజుల్లో ఈ రింగ్ బండ్‌ను ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తుండగా శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు ఈ రింగబండకు 25మీటర్ల మేర గండి పడింది. దీంతో రూ.మూడున్నర కోట్లు నీటిపాలయ్యాయి. శనివారం రాత్రి ఏపీలోని గుబ్బలమంగమ్మ ఆలయం పరిసరాల్లో కురిసిన భారీ వర్షాలకు తోడు, స్థానికంగా కూడా భారీ వర్షం కురవడంతో పెదవాగుకు భారీగా వరద పోటెత్తింది. దాంతో రింగ్‌బండకు గండి పడి ప్రాజెక్టులోని నీరంతా బయటికి పోయింది.

సీతారామ ప్రాజెక్టు మెయిన్ కాలువకు గండి

భారీ వర్షాలతో సీతారామ ప్రాజెక్టు మెయిన్‌కు 25మీటర్ల మేర గండి పడింది. భద్రాద్రి జిల్లా, ములకలపల్లి-పాల్వంచ మండలాల మధ్య వీకే మాదవరానికి రెండు కిలోమీటర్ల దూరంలో సీతారామ ప్రాజెక్టు పేజ్-3లో 38కి.మీటరు వద్దనున్న మెయిన్ కాలువకు సుమారు 25మీటర్లు పొడవు, నాలుగుమీటర్ల లోతున గండి పడింది. శనివారం రాత్రి కురిసిన వర్షాలకు వరదనీరు వచ్చి చేరడంతో ఈ గండి పడిందని అధికారులు చెబుతున్నారు. కాలువకు గండి పడటంతో కాలువ కింద ఉన్న బంద్రుగొండ గ్రామానికి చెందిన రైతుల పొలాలు సుమారు 40 ఎకరాల్లో పంట నీట మునిగింది. గండి పడిన ప్రాంతం ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంపుహౌస్‌ను ప్రారంభించిన ప్రాంతానికి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. వేల క్యూసెక్కుల నీటిని తరలించేందకు నిర్మించిన ఈ ప్రధాన కాలువ వర్షంతో వచ్చిన వరదకే తెగిపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాలువకు పడిన ఈ గండితో సుమారు రూ.20లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు చెబుతున్నారు. ఈ ఘటనపై సీతారామ ప్రాజెక్టు ఈఈ సురేష్‌ను వివరణ కోరగా ఎగువన పేజ్-2లో రాత్రి 29సెంటీమీటర్ల వర్షం కురవడంతో భారీగా వరద వచ్చి కాలువకు గండి పడిందని ఆయన తెలిపారు. ఈ ప్రాంతంలో రెగ్యులేటర్ నిర్మాణానికి ప్రతిపానలు పంపామని, అది నిర్మిస్తే కాలువకు ప్రమాదం ఉండదని తెలిపారు.

మున్నేరు బిడ్జిపై చిక్కుకున్న 9మంది

- సుమారు 10గంటలు గడిపిన బాధితులు
- వారిని రక్షించేందుకు హెలీకాప్టర్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన మంత్రులు
- వాతావారణం అనుకూలించక రాలేకపోయిన హెలీకాప్టర్
- రాత్రి 11గంటలకు సురక్షితంగా బయటికొచ్చిన బాధితులు
- సహాయక చర్యల్లో పాల్గొన్న ఎన్డీఆర్ఎఫ్ బృందం
- సహాయక చర్యలను పర్యవేక్షించిన మంత్రి తుమ్మల

ఖమ్మం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతిప్రతినిధి): మున్నేరు ఒక్కసారిగా వరద పోటెత్తడంతో ఆదివారం ఉదయం 9గంటల సమయంలో ఖమ్మం ప్రకాష్‌నగర్ బిడ్డిపై 9మంది చిక్కుకున్నారు. వీరిని రక్షించేందుకు పోలీసు అధికారులు తీవ్ర ప్రయత్నాలు చేశారు. డ్రోన్‌తో వారికి రక్షణ జాకెట్లు, టార్చిలైట్లు అందించారు. ఆదివారం 9గంటలకు బిడ్డిపై చిక్కుకున్న బాధితులు రాత్రి 11:00గంటల వరకు బిడ్డిపైనే బిక్కుబిక్కుమంటూ గడిపారు. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సాయంత్ర ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించారు. రాత్రి 9గంటలకు ఎన్డీఆర్ఎఫ్ బృందం చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించి బాధితులు ఉన్న ప్రాంతానికి వెళ్లగా ఈ సమయంలో బిడ్డిపై వరద తగ్గడంతో బాధితులు బిడ్డికి మరోవైపు నుంచి సురక్షితంగా బయటికి వచ్చారు. రాత్రి 7గంటల సమయంలో మంత్రి తుమ్మల సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ఘటనా స్థలానికి చేరుకోగా బాధితుల బంధువులు నినాదాలు చేశారు. అయితే మున్నేరు వరదలో తొమ్మిది మంది చిక్కుకున్నారన్న విషయం తెలుసుకున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల వెంటనే హైదరాబాదు నుంచి ఖమ్మం చేరుకుని వారిని రక్షించేందుకు అధికారయంత్రాంగం సాయంతో చర్యలు చేపట్టారు. ఏపీ నుంచి హెలికాప్టర్ తెచ్చేందుకు ఏపీ సీఎం చంద్రబాబుతో అక్కడి అధికారులతో మాట్లాడారు. అయితే వర్షం కారణంగా హెలికాప్టర్ రావడం సాధ్యంకాలేదు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలతో వారిని రక్షించేందుకు ఆ బృందాన్ని ఖమ్మం రావాలని ఆదేశించారు. వారు వచ్చేవరకు మంత్రి తుమ్మల బిడ్డి వద్దే ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. రాత్రి 9గంటలకు వచ్చిన ఎన్డీఆర్ఎఫ్ బృందంతో మంత్రి తుమ్మల చర్చించి ఆపరేషన్ ప్రారంభించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం స్పీడ్‌బోట్ల సాయంతో బ్రిడ్జిపైకి వెళ్లగా అప్పటికే బాధితులు బిడ్డికి మరోవైపునుంచి సురక్షిత ప్రాంతానికి చేరుకున్నారు. దాంతో 10 గంటల ఉత్కంఠకు తెరపడింది. బిడ్డిపై చిక్కుకున్నవారిని రక్షించేందుకు హెలీకాప్టర్ తెప్పించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా తీవ్రంగా ప్రయత్నించారు. కానీ వాతావరణం అనుకూలించకపోవడంతో హెలీకాప్టర్ రాలేకపోయింది.

వాగులో పడి ఇద్దరు వృద్ధుల మృతి

● 30ఆవులు, 100మేకలు మృత్యువాత ● అశ్వాపురం మండలంలో ఘటన


నీలమయ్య, ఆదెమ్మ మృతదేహాలు

అశ్వాపురం సెప్టెంబరు 1: భారీవర్షంతో భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండల పరిధిలోని వెంకటాపురం పంచాయతీ సాయిబులగుంపు గ్రామానికి చెందిన ఇద్దరు వృద్ధులు వాగులో కొట్టుకుపోయి మృతి చెందారు. వెంకటాపురం పాత సాయిబుల గుంపు గ్రామానికి చెందిన కల్లూరి నీలమయ్య(70), తాటి ఆదెమ్మ(68)లు గ్రామ సమీపంలో లోతు వాగు సమీపంలో జీవాల కోసం షెడ్లు నిర్మించుకుని గత కొన్ని సంవత్సరాలుగా వేర్వేరుగా జీవనం సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో ఎప్పటిలాగానే నీలమయ్య, ఆదెమ్మలు శనివారం రాత్రి తమ, తమ షెడ్‌లలో జీవాలతో నిద్రిపోయారు. అయితే అర్ధరాత్రి తరువాత భారీ వర్షం కురవడంతో లోతు వాగు ఒక్కసారి ఉప్పొంగటంతో మూగ జీవాలతో పాటు వృద్ధులు వాగులో కొట్టుకుపోయారు. తెల్లవారిన తర్వాత గ్రామస్థులు గమనించి వారిని వెతకగా కొంతదూరంలో వారి మృతదేహాలు లభ్యమయ్యాయి. సంఘటనా స్థలాన్ని అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి సందర్శించి సంఘటన వివరాలను తెలుసుకుని మృతదేహాలను పోస్టుమార్టం కోసం మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల పిర్యాధు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వెంకటాపురం గ్రామానికి చెందిన మృతులు నీలమయ్య, ఆదెమ్మలతో పాటు వారు కాపలాగా ఉన్న మూగజీవాలు కూడా వాగులో కొట్టుకుపోయి మృత్యువాత పడ్డాయి, షెడ్‌లలో ఉన్న నీలమయ్యకు చెందిన 30ఆవులు, ఆదెమ్మకు చెందిన 100మేకలు మృత్యువాత పడ్డాయి. దీంతో ఆయా కుటుంబాలకు సుమారు రూ.20లక్షల ఆస్తినష్టం సంభవించింది.

33 ఏళ్ల తరువాత

పాలేరుకు పోటెత్తిన వరద

- 27 అడుగులకు నీటిమట్టం
- చరిత్రలో లేనివిధంగా వరద ప్రవాహం
- ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై నీళ్లు
- రాకపోకలు బంద్

కూసుమంచి, సెప్టెంబరు 1: పాలేరు జలాశయం పరవళ్లు తొక్కుతోంది. గత రెండురోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పరీవాహకప్రాంతాల్లో నుంచి పెద్దఎత్తున వరదనీరు పాలేరుకు చేరుతోంది. దీంతో 22 అడుగులున్న నీటిమట్టం ఒక్కసారిగా పెరిగి 27అడుగులకు చేరుకుంది. దీంతో జలాశయం నిండుకుండగా మారి జలకళను సంతరించుకుంది. వర్షాలకారణంగా సాగర్‌నుంచి 5వేల క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతుంది. వరంగల్, సూర్యాపేట జిల్లాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా పాలేరు పరీవాక ప్రాంతాలనుంచి సుమారు లక్షా 55వేల క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతుందని నీటిపారుదల శాఖ ఈఈ మంగళపూడి వెంకటేశ్వరరావు తెలిపారు. మొత్తం లక్షా 60వేల క్యూసెక్కులు వస్తుండటంతో వచ్చిననీరు వచ్చినట్లే జలాశయంకు ఉన్న 24 ఫాలింగ్ గేట్ల ద్వారా బయటకు వెళ్లిపోతుంది. కాగా 1989లో జూలై నెలలో ఇదేరీతిలో 70వేల క్యూసెక్కుల నీరు ప్రవహించిందని ఐబీ అధికారులు తెలిపారు.

జాతీయ రహదారిపై రాకపోకల బంద్

పాలేరు జలాశయానికి రికార్డుస్థాయిలో వరదనీరు పోటెత్తింది. రాత్రికి రాత్రే పెద్దఎత్తున వరద వచ్చి చేరింది. దీంతో అనూహ్యంగా శనివారం రాత్రి 21.5 అడుగులునీరున్న పాలేరు.. తెల్లారేసరికి 27 అడుగులకు చేరింది. పాలేరు, నాయకన్‌గూడెం గ్రామాల్లో జలాశయం లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనలకు గురయి వెంటనే ఇళ్లను ఖాళీచేసి బయటకు వచ్చారు. పాలేరు అలుగుల ద్వారా వస్తున్ననీరు ఖమ్మం-సూర్యాపేట ప్రధానరహదారిపైనుంచి వరదనీరు భయంకరంగా ప్రవహిస్తోంది. పెద్దఎత్తున వరదనీరు ప్రవహిస్తుండటంతో ఇటీవల నిర్మించిన ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపైనుంచి ప్రవహించడంతో ఎటువంటి ప్రమాదాలు జరుగకుండా ముందస్తుగా పోలీసులు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. సుమారు లక్షన్నర క్యూసెక్కుల నీరు 15అడుగుల ఎత్తులో ఉన్న బ్రిడ్జిపైనుంచి వరదనీరు ప్రవహిస్తుండటంతో కనువిందుచేస్తుంది. ప్రస్తుతం రహదారిపై వాహనాలు అనుమతిస్తున్నప్పటికీ వరదనీరు మరింత పెరిగితే రాకపోకలు నిలిపివేసే అవకాశం ఉంది.

ఎడమకాల్వకు గండి

సాగర్ ఎడమకాల్వకు పాలేరు జలవిద్యుత్‌కేంద్రం వద్ద, మల్లాయిగూడెం వద్ద రెండుచోట్ల గండిపడింది. జలవిద్యుత్‌కేంద్రం కాల్వలో నీటిప్రవాహం ఎక్కువ కావడంతో కాల్వకు గండిపడింది. అదేవిధంగా జలవిద్యుత్‌కేంద్రంలోకి నీరు చేరింది. ఇదేనీరు కాల్వలో 15వేల క్యూసెక్కులనీరు ప్రవహించడంతో మల్లాయిగూడెం వద్ద 15అడుగుల వెడల్పులో గండిపడింది.

పర్యాటకులకు కనువిందు..

పాలేరు జలాశయం అలుగులు పారుతుండటంతో పర్యాటకులను కనువిందుచేస్తుంది. అలుగులు పారుతున్న విషయాన్ని సోషల్‌మీడియాలో తెలుసుకుంటున్న పర్యాటకులు పాలేరు జలాశయం వద్దకు వచ్చి చూసి వెళుతున్నారు. సెల్ఫీల్లో ఫోటోలు బంధిస్తున్నారు. కూసుమంచి తహసీల్దార్ సురేష్‌కుమార్, సీఐ సంజీవ్, ఎస్‌ఐ నాగరాజు, ఐబీ ఈఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి, ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.



పాలేరు జలవిద్యుత్‌కేంద్రం వద్ద కాల్వకు పడిన గండి

పాలేరు ఏటిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గల్లంతు

- ఒకరిని రక్షించిన పోలీసులు

కూసుమంచి, సెప్టెంబరు 1: కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద పాలేరు వరద ప్రవాహంలో చిక్కుకుని ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గల్లంతైన సంఘటన చోటుచేసుకుంది. అందులో ఒకరిని కూసుమంచి పోలీసులు కాపాడారు. శనివారం రోజంతా కురిసిన భారీ వర్షాలకు పాలేరు జలాశయానికి ఒక్కసారిగా వరద పోటెత్తింది. ఈక్రమంలో నాయకన్‌గూడెం గ్రామంలో పెట్రోల్ బంకు పక్కన షేక్ యాకూబ్ కుటుంబం సిమెంట్ బ్రిక్స్ చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆదివా రం ఒక్కసారిగా పాలేరు జలాశయం అలుగులు పారడంతో ఉదయం ఒక్కసారిగా వరద ప్రవాహం ఇంటిఆవరణను చుట్టుముట్టింది. దీంతో తమ ప్రాణాలు కాపాడుకునేందుకు యాకూబ్(48), ఆయన భార్య సైదాబీ(45), కుమారుడు షరీఫ్ ఇంటిపైకి ఎక్కారు. వరదలో చిక్కుకున్నారన్న సమాచారం తెలుసుకున్న అధికారులు వారిని కాపాడేందుకు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆధ్వర్యంలో రెస్క్యూ టీం, పోలీసులు ప్రయత్నించారు. కానీ వరద ఉధృతి వల్ల వీలుపడలేదు. దీంతో డ్రోన్ల సాయంతో సేఫ్టీ జాకెట్లను అందించారు. ఈక్రమంలో వరద ఉధృతి పెరగడంతో ఇంటిగోడ కూలడంతో యాకూబ్, అతని భార్య సైదాబీ, కుమారుడు షరీఫ్ గల్లంతయ్యారు. కిలోమీటరు దూరంలో ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై ఉన్న కానిస్టేబుల్ రాంబాబు గమనించి వెంటనే తాళ్లసాయంతో యువకుడిని రక్షించారు. యాకూబ్, సైదాబీ నీటిలో కొట్టుకపోగా ఆచూకీ లభ్యం కాలేదు.



బయటపడిన షరీఫ్

నిర్లక్ష్యమే ప్రాణం తీసింది

భారీ వర్షాలకారణంగా వరద వస్తుందని తెలిసినప్పటికీ వరదనీటిని అంచనావేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ఆకుటుంబం ప్రాణంమీదకు తెచ్చింది. అధికార యంత్రాంగం శనివారం సాయంత్రం నుంచే హెచ్చరించినప్పటికీ ఆ కుటుంబం పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. తీరా తెలుసుకునేటప్పటికి వరదనీరు చుట్టుముట్టి బయటకు రాకుండా చేసింది. ఇంటిపైకప్పు ఎక్కినప్పటికీ వరద ఉధృతికి ఆగోడ నిలవలేకపోయింది. దీంతో భార్యాభర్తలు ఇద్దరూ గల్లంతవగా, కుమారుడు షరీఫ్ మృత్యుంజయుడిగా మిగిలార్లు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ పర్యవేక్షించారు.

మణుగూరును ముంచిన వరద

- ఉగ్రరూపం దాల్చినకోడిపుంజుల వాగు, కట్టువాగు
- మునిసిపాలిటీ ప్రాంతమంతా ముంపునకు గురి
- పలుచోట్ల కూలిన ఇళ్లు.. ప్రహారీ గోడలు
- సహాయక చర్యల్లో పోలీసు రెవెన్యూ సిబ్బంది



వరదలో మణుగూరు ప్రదాన రహదారి పట్టణప్రాంతం

మణుగూరు, సెప్టెంబరు 1: మణుగూరు మండలాన్ని మునిసిపాలిటీ పట్టణ పరిసర ప్రాంతాన్ని ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షం నానా భీభత్సానికి గురి చేస్తూ అతలా కులతలం చేసింది. మణుగూరు చరిత్రలోనే 30 ఏళ్ల వరకు ఎన్నడూ లేని విధ ంగా మహా జలప్రళయం శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం మధ్యాహం వరకు సంభవించి ప్రజలను ప్రాణ భీతికి గురి చేసింది. అనుకోని రీతిలో ఎడతెరిపి లేకుండా కురిసిన బారీ వర్షం ఇంతటి విపత్తుకు కారణమైంది. భీకర వాన ఏడు గంటల పాటు మండలాన్ని ముద్ద చేయగా పట్టణంగుండా పారే కోటిపుంజుల వాగు, కట్టువాగు ప్రవాహాలు మహా ఉగ్రరూపాన్ని దాల్చి తమ ప్రతాపాన్ని ఇరుగురు పొరుగున ఉన్న జనావాసాల వాడలపై చూపాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.



మణుగూరు కోర్టు భవనం జలదిగ్బంధం

అనుకోని రీతిలో ఉప్పెన

అర్ధరాత్రి వేళ అనుకోని రీతిలో వరద మహా ఉప్పెనలా ఇళ్లలోని ప్రవేశించడంతో అప్పటికప్పుడు ఏం చేయాలో అర్థం కాక పరుగులు తీయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. శనివారం రాత్రి 9.30 గంటల తర్వాత నుంచి ఆరంభమైన కుంభవాన ఆదివారం తెల్లారుజామున 6 గంటల వరకు తన ప్రతాపాన్ని చూపుతూ పోయింది. 13 సెంటీమీటర్ల వాన ఓకే రోజు కురియడం మణుగూరు చరిత్రలో రికార్డుగా మారింది. మణుగూరు మునిసిపాలిటీ పరిధిలో ని సుందరయ్య నగర్, బాలాజీ నగర్ ఆదర్శనగర్, శ్రీశ్రీ నగర్, మేదర్ బస్తీ దిగువ ప్రాంతం వాగు మల్లారం, మామిడి చెట్ల గుంపు ప్రాంతాలు అన్ని పూర్తిగా జలదిగ్బంధం అయ్యాయి.ఇండ్లలో ఉన్న నిత్యవసర వస్తువులు, ఇతర సామాగ్రి అంతా కొట్టుకుపోయాయి. బియ్యం తడిచి ముద్దయ్యాయి.మణుగూరు డిగ్రీకాలేజీ, శ్రీవిద్యా కాలేజీల్లో పునరావాస కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. ఈ రెండు కేంద్రాల్లో 400 మందికి భోజన వసతి కల్పించినట్లు తహసీల్దార్ రాఘవరెడ్డి తెలిపారు. సహాయక చర్యల్లో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రిలో కుండపోత

- 23.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు
- రెండున్నర దశాబ్దాలలో ఇదే అత్యధికం
- పరిశీలించిన ఐటీడీఏ పీవో, ఏఎస్పీ

భద్రాచలం, సెప్టెంబరు 1: భద్రాచలంలో శనివారం రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురియటంతో రామాలయ పరిసరాలు, కాలనీలు, రహదారులు జలమయిమై చెరువులను తలపించాయి.ఈ సమయంలో రామాలయం పడమర మెట్ల వైపు, చప్టా దిగువ, విస్టా కాంప్లెక్స్, నిత్యాన్నదాన సత్రం, చర్ల రోడ్డులో కెకె ఫంక్షన్ హాల్ వద్ద నడుము లోతులోవర్షపునీరు ప్రవహించింది. ఈ క్రమంలో విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోయింది. భ ద్రాచలం వద్ద వనివారం ఉదయం 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గం టల వరకు 24 గంటలలో 23.4 సెంటీ మీటర్ల వర్షపా తం నమోదైనట్లు సిడబ్ల్యూసీ వర్గాలు పేర్కొంటున్నా యి. ఇదిలా ఉండగా గత రెండున్నర దశాబ్దాలలో భద్రా చలంలో ఇంత భారీ వర్షం కురవలేదని పేర్కొంటున్నారు.

అన్నదాన సత్రంలో వర్షపు నీరు

భ ద్రాచలంలో శనివారం రా త్రి భారీ వర్షం కురియటంతో ఆ ప్రభావం దేవస్థానం నిత్యాన్నదాన సత్రం, సెంట్రల్ ప్రొవిజనల్ స్టోర్ పై పడింది. అన్న దాన సత్రంలో రాత్రి భారీగా నీరు చేరటంతో సామాన్లన్నీ చెల్లాచెదురయ్యాయి. దీంతో దేవస్థానం అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టారు.

కూలిన ప్రహరీ: పరిశీలించిన పీవో, ఏఎస్పీ

భద్రాచలంలోని కూనవరంరోడ్డులో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల ఆ శ్రమ పాఠశాలలోని ప్రహరీ గోడ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూలిపోయింది. సమాచారం తెలుసుకున్న ఐటీడీఏ పీవో బి రాహుల్, ఏఎస్పీ అంకిత్ శంక్వార్ సందర్శించి పరిస్థితిని పరిశీలించారు.

అధికారులు, ప్రజలు అ ప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

భద్రాచలం డివిజన్‌లోని అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సూచించారు. మరో రెండు రోజులు ఉండే అవకావం ఉందని వాతావరణ శాఖ తెలిపిన నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు.



చెరువులను తలపిస్తున్న భద్రాద్రి రహదారులు

రాకాసితండాలో వరదల్లో చిక్కుకున్న 54మంది

- కాపాడిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది
- వరద ఉధృతిని పర్యవేక్షించిన కలెక్టర్ , సీపీ

తిరుమలాయపాలెం, సెప్టెంబరు 1: రెండురోజులుగా మండలంలో కురిసిన భారీవర్షం బీభత్సం సృష్టించింది. గతంలో ఎన్నడూలేని విధంగా భారీవర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు పొంగి ప్రవహించాయి. సుమా రు 263మి.మీ.వర్షపాతం నమోదయింది. దీంతో వాగులు, వంకలు పొంగాయి. భారీవర్షంతో పంటలకు తీవ్ర నష్టం జరిగింది. బీరోలులో భారీవర్షానికి పెద్దచెరువుకు గండి పడింది. దీంతో పక్కనే ఉన్న బంధంపల్లి గ్రామం నీటము నిగింది. దీంతో ప్రజలు పక్కనే ఉన్న ఫంక్షన్‌హాల్ లో తలదాచుకున్నారు. భారీవర్షంతో బీరోలు- బంధంపల్లి, బీరోలు-పోచారం, బచ్చోడు-హస్నా బాద్, కేశ్వాపురం-తిప్పారెడ్డిగూడెం వరకు వాగులు పొంగడంతో రాకపోకలు నిలిచాయి. దీంతో ప్రజలు నానా ఇబ్బందులుపడ్డారు.

54మందిని కాపాడిన ఎన్డీఆర్ఎఫ్

మండలంలోని రాకాసితండాలో వరదల్లో చిక్కుకున్న 54మందిని ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది స్థానిక పోలీసులు రక్షించారు. రెండురోజులుగా కురుస్తున్న భారీవర్షాలతో ఆకేరు ఉధృతితో రాకాసితండాకు భారీనీరు ప్రవేశించింది. గ్రామస్థులు 54మంది వరదలో చిక్కుకున్నా రు. రాత్రి నుంచి ఇళ్లపైకి ఎక్కి తలదాచుకున్నారు. దీంతో ఆదివారం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాల మేరకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వారిని రక్షించారు. బోట్లు ద్వారా పక్కనే మహబూబా బాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుక్కో యలపా డు తరలించారు. ఎన్డీఆర్ ఎఫ్ బృందాలు సుమా రు రెండుగంటలపాటు శ్రమించి తరలించారు. కలెక్టర్ రాకాసితండాకు చేరుకుని రెండుగంటలపాటు అక్కడే ఉండి సహాయ చర్యలు చేపట్టారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టారు. కలెక్టర్, సీపీ సునీల్‌దత్, ఏసీపీ తిరుపతిరెడ్డి, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్, డీటీ నర్సింహారావు పాల్గొన్నారు.



వరదలో చిక్కుకున్న వారిని కాపాడుతున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

మధిరలో చెరువులో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన గజ ఈతగాళ్లు

ఊపిరిపీల్చుకున్న అధికారులు, కుటుంబసభ్యులు

మధిరరూరల్: మధిర మండలం వంగవీడు గ్రామంలో చేపల చెరువులో వల సరిచేసేందుకు వెళ్లి శనివారం సాయంత్రం మూడుగంటల సమయంలో ఆ గ్రామానికి చెందిన తోటపల్లి చిన్నవెంకటేశ్వర్లు అలుగు వద్ద వరదనీటిలో చిక్కుకుపోయాడు. దీంతో అతడి బంధువులు, స్థానికులు ఆందోళన చెందారు. ఈ విషయం డిప్యూ టీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకువెళ్లడంతో వరదలో చిక్కుకున్న వెంకటేశ్వర్లును సురక్షితంగా బయటకు తీసుకువచ్చే కార్యక్రమాన్ని చేపట్టాలని జిల్లా, నియోజకవర్గస్థాయి అధికారులను ఆదేశించడంతో వారంతా రంగంలోకి దిగారు. మండల అధికారులు రాత్రి సమయంలో గజ ఈతగాళ్లను తీసుకొని అక్కడకు వెళ్లారు. రాత్రి ఒంటిగంట సమయంలో చిక్కుకున్న వెంకటేశ్వర్లును సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అర్ధరాత్రి తర్వాత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వంగవీడు చెరువు ప్రాంతం వద్దకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్‌తో కలిసి చేరుకున్నారు. సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షించారు. ఆతర్వాత సురక్షితంగా బయటపడిన వెంకటేశ్వర్లుతో మాట్లాడారు.

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

టేకులపల్లి, సెప్టెంబరు 1: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందిన సంఘటన ఇల్లెందు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై మండలంలోని ముత్యాలంపాడుస్టేజి వద్ద ఆదివారం జరిగింది. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం మండలంలోని కోయగూడెం పంచాయతీ పరిధిలోని హన్మతండాకు చెందిన భూక్యా పద్మా(31) ముత్యాలంపాడుస్టేజి వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో కొత్తగూడెం వైపునుంచి ఇల్లెందు వైపునకు అతివేగంగా వస్తున్న డీసీఎం వాహనం ఆమెను ఢీకొట్టింది. తీవ్రగాయాలైన పద్మను ఆస్పత్రికి తరలించగా మృతిచె ందింది. కాగ మృతురాలి కూతురు అంజలీ జూలూరుపాడు మండలంలోని నర్సాపురం కస్తూర్బా పాఠశాలలో 7వ తరగతి చదువుతుంది. కూతురుకు జ్వరం వస్తుందనే సమాచారం మేరకు ఆదివారం అక్కడికి వెళ్లి కూతుర్ని వెంట తీసుకొని ఇంటికి వస్తున్న క్రమంలో ముత్యాంపాడుస్టేజిలో బస్సుదిగి కోయగూడెం వైపు వెల్లుటకు రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. మృతురాలు పద్మా, ఆమె భర్త హన్మంతులు ఇటీవలనే చంద్రుగొండ మండలంలోని పోకలగూడెం నుంచి ఆమె పుట్టింటికి వచ్చి ఇక్కడ కూలీపనులు చేస్తూ జీవనసాగిస్తున్నారు. మృతురాలికి భర్తతో పాటు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు టేకులపల్లి ఎస్ఐ పోగుల సురేష్ తెలిపారు.

వరదలో గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

మధిరరూరల్, సెప్టెంబరు 1: మధిర మండలం దెందుకూరు గ్రామంలో గేదెలు మేపేందుకు శనివారం పొలాలకు వెళ్లిన మహిళ వరదల్లో చిక్కుకొని గల్లంతైంది. అయితే ఆ మహిళ మృతదేహం ఆదివారం వరదనీటిలో లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. దెందుకూరుకు చెందిన నన్నెబోయిన పద్మావతి (36) శనివారం మధ్యాహ్నం 12గంటల సమయంలో గ్రామసమీపంలోని రైల్వే ట్రాక్ వైపు పొలాల్లోకి మేత కోసం గేదెలను తోలుకొని వెళ్లింది. గేదెలను మేపుకొని తిరిగి వస్తుండగా ఒక్కసారిగా కురిసిన భారీ వర్షానికి వరదల్లో చిక్కుకుపోయింది. సాయంత్రం ఆరుగంటలైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పద్మావతి ఆచూకీ కోసం వెతికినా ఎక్కడా కన్పించలేదు. ఆదివారం ఉదయం మళ్లీ గేదెలను తోలుకువెళ్లిన వరద ప్రాంతాల్లో ఈమె ఆచూకీ కోసం వెతకగా రైల్వే ట్రాక్ సమీపంలోని ఓ పొలంలో నీళ్లలో కంపచెట్టు వద్ద మృతదేహమై కన్పించింది. దీంతో ఆమె మృతదేహాన్ని వెలికితీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈమె మృతితో కుటుంబసభ్యుల్లోనూ, గ్రామంలోనూ విషాదం నెలకొంది..

వికలాంగుడి మృతదేహానికి పోస్టు మార్టమ్

మణుగూరు,సెప్టెంబరు 1: మణుగూరు మునిసిపల్ పరిధిలోని సుందరయ్య నగర్ ప్రాంతంలో ఇంట్లో నిద్రావస్థలో ఉన్న వికలాంగుడు నందికోళ్ల రాము వరద ముంపు ప్రమాదానికి గురై మునిగి మృతి చెందాడు. తల్లి వృద్ధురాలు. ప్రస్తుత ఆపద సమయంలో తన అనుకున్న వారెవరూ దగ్గరలో లేరు. ఈ విషయాన్ని తెలుసుకున్న తహసీల్దార్ మానవతా దృక్పధంతో స్పందించారు. మృత దేహానికి పోస్టు మార్టమ్ చేయాలంటే సుందరయ్య నగర్ నుంచి 100 పడకల ఆసుపత్రికి తరలించాలి. ఉన్న వృద్దురాలైన తల్లికి సాధ్యం కాని పని దీంతో తహసీల్దార్ రాఘవరెడ్డి మృతదేహాన్ని భుజాన వేసుకుని ఇంట్లోనుంచి భయటికి తెచ్చి అంబులెన్స్ ఎక్కించి ఆసుపత్రికి తరలించారు. అంతేకాకుండా పోస్టు మార్టమ్ అనంతరం తిరిగి ఆ మృత దేహాన్ని స్వగృహానికి తెచ్చి తల్లికి అప్పగించారు.

కిన్నెరసానికి వరదపోటు

- ముంచెత్తిన కిన్నెరసాని, లొద్దివాగు, రాళ్లవాగు
- కిన్నెరసాని పూర్తిస్థాయి గేట్లు ఎత్తివేత
- భయంతో వణికిన లోతట్టు ప్రాంత ప్రజలు
- 40 గ్రామాలకు తెగిన సంబంధాలు



కిన్నెరసాని నుంచి వస్తున్న నీరు

పాల్వంచ రూరల్, సెప్టెంబరు 1: పాల్వంచ మండలంలోని కిన్నెరసాని లోతట్టు ప్రాంత ప్రజలకు జలప్రళయ ప్రమాదం కళ్ల ముందే కనిపించింది. ఒక వైపు ఎడతెరిపి లేని వర్షం.. మరో వైపు కిన్నెరసాని ప్రాజెక్టు నిండి ఒక్కసారి శనివారం అర్ధరాత్రి ఎటువంటి హెచ్చరికలు లేక పూర్తి గేట్లు ఎత్తారు. నీటి ప్రవాహం ఇళ్లలోకి చేరుతుండటంతో కట్టుబట్టలతో బయటకు పరుగులు తీశారు. సమీపంలోని పాఠశాల, బస్‌సెంటర్లను ఆశ్రయించారు. ఇంట్లోని సామాగ్రిని తెచ్చుకునేందుకు కూడా వీలే లేకుండపో యింది. గ్రామాల్లోని ప్రజలు పల్లపు ప్రాంతానికి చేరుకున్నారు. ఎడ తెరిపి లేకుండ కురిసిన కుండపోత వర్షానికి కిన్నెరసాని జలాశయం నిండిపోయింది. 407అడుగుల సామర్థ్యానికి చేరుకోవడంతో ప్రాజెక్టు అధికారులు తొలుత 5గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తామని హెచ్చరికలు చేశారు. ఎగువ ప్రాంతాల 80వేల క్యూసెక్కుల నీరు డ్యాంకు చేరడంతో 12గేట్లను అర్ధరాత్రి సమయంలో వదిలారు. 1.50లక్షల క్యూసెక్కుల నీటిని ఒక్కసారిగా ఎత్తడంతో నీరు ఉధృతంగా ప్రవహించింది. ప్రాజెక్టు పక్కనే ఉన్న కిన్నెరసాని, రాజాపురం గ్రామాల్లోకి వరదప్రవాహం చేరింది. ఆ సమయంలో ఇళ్లలో ఉన్న వారు కట్టుబట్టలతో బయటకు పరుగులు తీశారు. ప్రాజెక్టు అధికారులు ముంపు ప్రజల ఆందోళనకు వద్దకు వెళ్లి ఇకపై ముందస్తు హెచ్చరికలుచేస్తామని హామీ ఇచ్చారు.

ముంచెత్తిన కిన్నెరసాని, లొద్దివాగు, రాళ్లవాగు

కిన్నెరసాని పరివాహక ప్రాంతంలో ఎగువ భాగంలో ఉన్న లొద్దివాగు, రాళ్లవాగులుపొంగి ప్రవహించాయి. దీంతో 40 గ్రామాలను ముంచెత్తాయి. ఉల్వనూరు గ్రామం చుట్టు నీరుచేరడంతో ప్రజలు సామాగ్రిని రోడ్డుపైకి తెచ్చుకున్నారు. హస్టల్ విద్యార్థులు బయటకురాలేకపోయారు. మల్లారం, చంద్రాలగూడెం, మామిడిగూడెం గ్రామల మధ్య రహదారులు తెగిపోయాయియి. మందరికలపాడు ప్రధానరహదారి రాళ్లవాగు నీటికోతకు గురికావడంతో పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ వాగు ప్రవాహం వల్ల సుమారు 40 గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయయి. పాండురంగాపురం బ్రిడ్జిపై కిన్నెరసాని నీరు ప్రవహిస్తుంది. వాగులు ప్రవాహానికి గ్రామాల్లో చేరుచేరడంతో 12 పశువులు మృతిచెందాయి. ఈవాగుల ప్రవాహం వల్ల సుమారు 14 కిలోమీటర్ల పొడవున ఉన్న పరివాహక పంటభూములు నీటికోతకు గురయ్యాయి.

మణుగూరు హెవీవాటర్ ప్లాంట్‌కు వరద ముప్పు

- షట్‌డౌన్ చేసిన అధికారులు

అశ్వాపురం సెప్టెంబరు 1: ప్రతిష్ఠాత్మక మణుగూరు హెవీవాటర్ ప్లాంట్ కు వరద ముప్పు ఏర్పడటంతో ఉన్నతాధికారులు ఆదివారం ప్లాంట్ లో షట్‌డౌన్ నిర్వహించారు. ప్లాంట్ ప్రధాన విభాగమైన క్యాప్టివ్ పవర్ ప్లాంట్(సీపీపీ) కు సంబంధించిన 220 కేవీ సబ్‌స్టేషన్‌లోకి వరద నీరు చేరటంతో ఉత్పత్తికి అంతరాయం కలుగుతుందన్న నేపథ్యంలో అధికారులు ప్లాంట్ షట్‌డౌన్ నిర్వహించారు. ఈసందర్భంగా ఉద్యోగులు నివాసం ఉండే గౌతమీ నగర్ కాలనీకి తాగునీరు, విద్యుత్ సరఫరా బంద్ కావటంతో జనరేటర్‌ల సహయంతో తాగునీటిని కాలనీ వాసులకు తాగునీరు సరఫరా చేశారు. కాగా 2019లో తీవ్ర వర్షాభావం, 2022 లో గోదావరి వరదలు కారణంగా ప్లాంట్‌ను అధికారులు షట్‌డౌన్ చేయగా, ప్రస్తుతం భారీ వర్షాలతో షట్‌డౌన్ చేయటం విశేషం. కాగా ప్లాంట్‌ను భారీవర్షాల కారణంగా షట్‌డౌన్ నిర్వహించిన మాట వాస్తవమేనని,వర్షాలు తగ్గిన వెంటనే ఉత్పత్తిని పునఃరుద్ధరిస్తామని హెవీవాటర్ ప్లాంట్ జీఎం జగ్గారావు తెలిపారు.



మణుగూరు హెవీవాటర్‌ప్లాంట్

మధిర- విజయవాడ మధ్య రైళ్ల రాకపోకలు బంద్

- వరద ఉధృతికి కొండపల్లివద్ద రైల్వే ట్రాక్ ధ్వంసం
- మధిర డివిజన్‌లో గంటల తరబడి నిలిచిన మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు

మధిర, సెప్టెంబరు 1: తుఫాన్ ఎఫెక్ట్ రైల్వే వ్యవస్థను అతలాకుతలం చేసింది. శనివారం అర్ధరాత్రి కురిసిన కుంభవృష్టితో మధిర డివిజన్ పరిధిలోని పలు స్టేషన్లను వరద నీరు చుట్టుముట్టాయి. కొండపల్లి వద్ద మాడవేరు వాగు పొంగి కట్ట తెగిపోవడంతో వరద నీరు కొండపల్లి-రాయన్నపేట స్టేషన్ల మధ్య రైల్వే పట్టాలపైకి చేరింది. దీంతో పట్టాల క్రింద కంకర మొత్తం కొట్టుకుపోయి రైల్వే లైన్ ధ్వంసమైంది. దీని కారణంగా అర్ధరాత్రి 2గంటల సమయంలో మధిరలో గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ నిలిచిపోయింది. దానికన్నా ముందు వెళ్లిన విశాఖపట్నం లింక్ ఎక్స్‌ప్రెస్‌ను గంగినేనిలో, జైపూర్ ఎక్స్‌ప్రెస్‌ను చెరువుమాధవరంలో నిలిపేశారు. అర్ధరాత్రి నుంచి ఉదయం పది గంటల వరకు వర్షం ఏకదాటిగా కురవడంతో సహాయక చర్యలు ఏమీ చేపట్టలేదు. ఉదయం పది గంటల తర్వాత ఈమూడు ఎక్స్‌ప్రెస్‌లను తిరిగి మధిర రప్పించి మోటమర్రి జంక్షన్ బైపాస్ మీదుగా జగ్గయ్యపేట లైన్‌లో విష్ణుపురం నుంచి నడికుడి లైన్‌కు దారి మళ్లించి పంపారు. గుంటూరు మీదుగా విజయవాడకు పంపారు. అలాగే వీటి తర్వాత వచ్చిన సింహాద్రి, గౌతమి, పద్మావతి, ఎల్‌టీటీ విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్‌లను కూడా మోటమర్రి బైపాస్‌గుండా జగ్గయ్యపేట, విష్ణుపురం మీదుగా నడికుడి లైన్‌కు దారి మళ్లించి పంపారు. రైల్వే లైన్ ధ్వంసం కావడంతో మధిర మీదుగా విజయవాడ వెళ్లే అన్ని రైళ్లను రద్దు చేయడం జరిగిందని, కొన్నింటిని దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ప్రయాణికుల ఇబ్బందులు

మధిర, చెరువుమాధవరం, గంగిగేని స్టేషన్లలో అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు దాదాపు 8గంటలపాటు రైళ్లు నిలిచిపోవడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక వైపు జోరున వర్షం కురుస్తుండటంతో బైటకు రాలేక, తినేందుకు ఏమీలేక ఇబ్బందులుపడ్డారు. మధిరలో గరీబ్‌రథ్ రైలులో ప్రయాణీకులు తినేందుకు ఏమీలేక అవస్థలు పడ్డారు. వారి పరిస్థితిని గమనించిన మధిర రైల్వే కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ ఒక హోటల్ వారితో మాట్లాడి ఉప్మా వండించి పంపిణీ చేశారు. ప్రయాణీకులు వర్షం కారణంగా ఏసీ బోగీలనుంచి బైటకు కూడా రాలేదు. తలుపులు వేసుకొనే రైలులో ఉండిపోయారు.



మధిరలో నిలిచిన రైలు

ప్యాసింజర్ రైళ్లు రద్దు

కొత్తగూడెం, పోస్టాఫీస్‌సెంటర్, సెప్టెంబరు 1: భారీ వర్షాలు కురవడంతో రైల్వే సేవలకు తీవ్ర అంతారయం కలగడంతో కొత్తగూడెం(భద్రాచలంరోడ్) నుంచి హైదరాబాద్ ప్రాంతాలని వేళ్లే మార్గంలో మహబూబాబాద్ వద్ద రైల్వే ట్రాక్ వరదకు కొట్టుకుని పోవడంతో కొత్తగూడెం నుంచి సికింద్రాబాద్ వెళ్లాల్సిన మణుగూరు సూపర్‌పాస్ట్ ఎక్స్‌ప్రెస్, కాకతీయ ఫాస్ట్ ప్యాసింజ ర్, సింగరేణి ప్యాసింజర్, విజయవాడ ప్యాసింజర్‌లను రద్దు చేస్తున్నట్టు సౌత్‌సెంట్రల్ రైల్వే కార్యాలయం ఆదివారం రాత్రి తెలిపింది.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
భద్రాద్రి కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట
8
సోమవారం 2 సెప్టెంబరు 2024

అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు: ఎస్పీ

కొత్తగూడెం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల జిల్లాలోని నదులు, వాగులు, వంకలు, చెరువులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తూ రోడ్లపైకి చేరు చేరే అవకాశం ఉందని కావున కాలి నడకన, వాహనాలతో ప్రజలు రోడ్లు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ రోహిత్ రాజ్ సూచించారు. సెల్ఫీల కోసం ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రదేశాలకు వెళ్లి ప్రమాదాలకు గురికావొద్దని తెలిపారు. జిల్లా పోలీస్ యంత్రాంగం ఇతర శాఖలతో కలిసి ఇప్పటికే వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారుతున్న రహదారులు, చెరువులు, వాగులు, నదుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వరదల్లో చిక్కుకుని ఆపదలో ఉన్న వారిని రక్షించడానికి జిల్లా పోలీస్‌శాఖ తరఫున ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేవిధంగా డీడీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచడం జరిగిందని తెలిపారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటున్నట్లైతే 100కి ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

ఆకాశానికి చిల్లు

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం.. పొంగిన వాగులు
- పలు ప్రాంతాలకు రాకపోకల బంద్
- నీట మునిగిన పంట పొలాలు.. రైతన్ననైరాశ్యం
- లోతట్టు ప్రాంతాల జలమయం.. ప్రజల అవస్థలు


నారచీరల వద్ద మునిగిన దుకాణాలు


బేతాళపాడు-పడమటనర్సాపురం మధ్య పొంగిన పెద్దవాగు


'పేట' మండలం వాగొడ్డుగూడెం వద్ద వాగు ఉధృతి


ఎదుళ్లవాగు వద్ద స్థానిక పోలీసులతో ఎస్పీ మాటమంతీ


కొత్తగూడెం-ఖమ్మం రహదారిపై వరద నీరు


ఇల్లెందు లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే


నిండిన కిన్నెరసాని జలాశయం

కొత్తగూడెం, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి) 1: జిల్లా వ్యాప్తంగా శనివారం అర్ధరాత్రి నుంచి వర్షం దంచికొట్టింది. ఈ భారీ వర్షానికి జిల్లా వ్యాప్తంగా పలు మండలాలు అతలాకుతలమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా సగటున 14.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అశ్వాపురం మండలం సుమారు 22 సెంటీమీటర్ల వర్షపాతం కురవడంతో వెంకటాపురం పంచాయతీలోని సాయిగుంపువద్ద లోతువాగు సమీపంలో ఇద్దరు వృద్ధులు మృతి చెందారు. భారీ వర్షంతో వాగులు పొంగిపొర్లాయి. పలు ప్రాంతాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి.

10 మిమీ వర్షం..

జూలూరుపాడు: మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు భారీ వర్షం కురిసింది. 106.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో మండలంలోని పలు గ్రామాల మధ్య గల వాగులు పొంగి పొర్లడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. పత్తి, మిర్చి, వరి పంటలు నీట మునిగాయి. అన్నారపాడు- గుండ్లరేవు గ్రామాల మధ్య గల అలుగువాగు, బేతాళపాడు- పడమట నర్సాపురం గ్రామాల మధ్య గల పెద్దవాగు, తుమ్మలవాగు, గోపతండా-గురవాగుతండా గ్రామాల మధ్య గల ఎర్రవాగు, కాకర్ల-అనంతారం గ్రామాల మధ్య గల ఎర్రవాగులు పొంగి పొర్లాయి. గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

ఎడతెరిపిలేని వాన

అశ్వారావుపేట రూరల్: అశ్వారావుపేట మండలవ్యాప్తంగా దాదాపు 10 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. భారీ వర్షంతో వాగులు పొంగి ప్రవహించాయి. మండలంలోని వాగొడ్డుగూడెం సమీపంలో వాగు దాదాపు 10 అడుగుల ఎత్తులో పొంగటంతో అనంతారం మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. కావడిగుండ్ల, కన్నాయిగూడెం, నారాయణపురం ప్రాంతాల్లోనూ వాగులు ఉధృతంగా పారాయి. తహసీల్దారు కృష్ణప్రసాద్ గ్రామాల్లో తిరిగి పరిస్థితిని పర్యవేక్షించారు.

మునిగిన పర్ణశాల నారచీరలు

దుమ్ముగూడెం: సీతవాగు ఉధృతితో పర్ణశాల నారచీరల ప్రాంతం ఆదివారం ముంపునకు గురైంది. ఫుట్ బ్రిడ్జితో పాటు సమీపంలోని దుకాణాలు సైతం నీట మునిగాయి. గంగోలు చెరువుకు అలుగు పడడంతో బుర్రవేముల వద్ద ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపైకి నీరు చేరింది. దీంతో భద్రాచలం-చర్ల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉదయం పదకొండు గంటల సమయంలో వరద ఉధృతి తగ్గడంతో రాకపోకలు కొనసాగాయి. ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద ప్రవాహంతో బైరాగులపాడు-సున్నంబట్టిల మధ్య లోలెవల్ కాజ్‌వే ముంపుకు గురవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పెదనల్లబల్లి-లక్ష్మీపురం మధ్య రహదారిపైకి వరదనీరు స్వల్పంగా చేరింది. తహసీల్దార్ అశోక్‌కుమార్ పరిస్థితులను సమీక్షిస్తున్నారు.

చర్లలో..

గత రెండు రోజులుగా చర్ల మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, చెరువులు, కుంటలు పొంగి పొర్లు తున్నాయి. మండల కేంద్రంలో వీధులు జలమయం అయ్యాయి. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టుకు వరద నీరు వచ్చి చేరుతోంది. ఆదివారం 25 గేట్ల ను ఎత్తిన అధికారులు 42 వేల క్యూసెక్కుల నీటిని విడదుల చేశారు.

భారీ వర్షానికి నిండిన చెరువులు

చుంచుపల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి చుంచుపల్లి మండలంలో ప్రధాన రహదారులు పూర్తిగా జలమయమయ్యాయి. చింతలచెరువు వరద నీరు భారీగా చేరడంతో కాలువల నుంచి వరద నీరు కొత్తగూడెం - ఖమ్మం రహదారిపై పొంగి ప్రవహించింది. ఈ రహదారి చెరువులు తలపించింది. మండలంలోని పెనుబల్లి పంచాయతీకి వెళ్లే పెనుబల్లి బ్రిడ్జీ గోధుమ వాగు ఉధృతంగా ప్రవహించడంతో బ్రిడ్జిపై వరద ప్రవాహం పొంగి పొర్లింది. ఎస్పీ రోహిత్‌రాజు, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్‌తో కలిసి పెనుబల్లి బ్రిడ్జి వద్దకు చేరుకొని పరిశీలించారు.

పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు

ఇల్లెందు టౌన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇల్లెందు పట్టణంలో వివిధ ప్రాంతాల్లో జన జీవనం స్తంభించిపోయింది. ఇల్లెందులపాడు మంచినీటి చెరువుకు వరద పోటు ఎత్తడంతో చెరువు అలుగుపోస్తోంది. చెరువు అలుగు ప్రవాహానికి పట్టణంలోని సత్యనారాయణ పురానికి రాకపోకలకు నిలిచిపోయాయి. సత్యనారాయణ పురం వెళ్లే బ్రిడ్జి పై నుంచి అలుగు ప్రవాహంలో ఓ యువకుడు ప్రమాదవశాత్తు కొట్టుకుపోతుండగా అక్కడే ఉన్న పోలీసులు, యువకులు కాపాడారు. వరద ముంపు ప్రాంతాల్లో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, డీఎస్పీ చంద్రభాను, సీఐ సత్యనారాయణ పర్యటించారు.

కొట్టుకుపోయిన రోడ్లు

టేకులపల్లి: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మండలంలోని సంపత్‌నగర్-అనిశెట్టిపల్లి రహదారిలో సంపత్‌నగర్ సమీపంలో పారికలవాగు బ్రిడ్జి వద్ద రోడ్డు కొట్టుకపోయింది. దీంతో మండలంలోని గ్రామాలతో పాటు ఆళ్లపల్లి మండలానికి రాకపోక లు ఇబ్బందిగా మారాయి. ఆళ్లపల్లికి వెళ్ళాల్సిన ఆర్టీసీ సేవలు ఆగిపోయాయి. పెట్రాంచెలక, ఒడ్డుగూడెం-బర్లగూడెం గ్రామాల మధ్యఉన్న తెల్లవాగు, మద్రాసుతండా-కొండంగులబోడు గ్రామాల మధ్య వాగులు పొంగిపొర్లాయి. చింతోనిచెలక గ్రామానికి చెందిన రైతు జోగ పుల్లయ్య తన పశువులను వాగొడ్డున తన చేనువద్ద కట్టేసి ఇంటికి వెళ్లాడు. వర్షానికి నాగారంజోగు వాగు పొంగి పశువులు కొట్టుకపోయి మరణించాయి.

కరకగూడెం మండల వ్యాప్తంగా జోరు వాన

కరకగూడెం: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి ఆదివారం మండలంలోని గుట్టలు, పులుసుబొంత, వట్టివాగు, అడవుల నుంచి వరద ప్రవాహం ఎక్కువగా రావడంతో పెద్దవాగు, ఒర్రెలు పొంగి పొర్లాయి. వరద ఎక్కువగా రావడంతో మండలంలోని వం దల ఎకరాల్లో వరద నీరు ముంచేంతింది. కరకగూడెం నుం చి చిరుమళ్ల వెళ్లే పెద్దవాగు బ్రిడ్జి వద్ద వరద ప్రవాహానికి రహదారి కోతకు గురైంది. దాంతో పంచాయితీ అధికారులు రెండు గ్రామాలకు రాక పోకలు నిలిపివేశారు. కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జిని తహసీల్దార్ నాగ ప్రసాద్, ఎస్ఐ రాజేందర్ తదితరులు పరిశీలించారు.

జడివాన..జనం భయాన..

పినపాక: రెండు రోజులుగా కుండపోతగా కురుస్తున్న జడివానతో మండల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఓవైపు వరద నీరు ఇండ్లలోకి చేరుతుండడం, మరోవైపు తెరపివ్వని వానతో అతలాకుతలం అవుతున్నారు. భారీ వర్షాల కారణంగా మండలంలోని పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎల్చిరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు గత ఏడాది భారీ వరదలకు కొట్టుకుపోవడంతో అప్రమత్తమైన అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టి ముందస్తుగానే మూసేశారు. గోపాల రావు పేట గ్రామానికి చెందిన అంకతి సోమయ్య ఇల్లు భారీ వర్షాల కారణంగా కూలిపోయింది. వర్షం అధికమ వుతుండడంతో, అప్రమత్తమైన సోమయ్య తన కటుంబంతో బయటకు రావడంతో ప్రమాదం తప్పింది. దీంతో కుటుం బం రోడ్డున పడింది. పినపాక, ఉప్పాక, సీతంపేట గ్రామాల్లోని దెబ్బతిన్న రోడ్లను, ఇండ్లను, లోతట్టు గ్రామాల్లో వరద పరిస్థితిని ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో వెంకటేశ్వరరావు, ఎస్ఐ రాజ్‌కుమార్‌లు పరిశీలించారు. జానంపేట, భూపతిరావుపేట, చింతలబయ్యారం గ్రామాల్లో తహశీల్దార్ సూర్యనారాయణ పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు.

జలదిగ్బంధంలో ఆళ్లపల్లి మండలం

ఆళ్లపల్లి: ఆళ్లపల్లి మండలం జలదిగ్బంధంలో చిక్కుకుంది. కిన్నెరసాని, జల్లేరు, కొడెలవాగులతో పాటు ఒర్రెలు, చెరువులు ఉగ్రరూపం దాల్చడంతో పలు గ్రామాలతో ఆళ్లపల్లి మండలానికి, జిల్లా కేంద్రానికి రాకపోకలు నిలిచాయి. మర్కోడులోని రేగడి చెరువు అలుగు వరద ఉప్పొంగడంతో తాళ్లపల్లి నాగేశ్వరావు, అశోక్, నవీన్, రంజిత్, పెద్దసత్తయ్య ఇల్లలోకి వరద నీరు చేరింది, వరదకు రోడ్డు కోతకుగురైంది. వరదలకు ఆళ్లపల్లి, లక్ష్మీపురం మధ్య బ్రిడ్జీ కుంగిపోయింది. ఎంపీడీవో శ్రీనివాస్ స్థానిక అధికారుల సహకారంతో వరదల తీవ్రతను పర్యవేక్షించారు. ఇదే వర్షం కొనసాగితే రేగడి చెరువు క్రింద ఉన్న వాసులతో పాటు, శిఖం శివారులో ఉన్న ఇళ్లలోకి భారీగా వరద చేరే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

అశ్వాపురం అతలాకుతలం

అశ్వాపురం: భారీ వర్షానికి అశ్వాపురం మండలం అతలాకుతలమయ్యింది. రహదారులు జలదిగ్బంధమయ్యాయి. దీంతో పలు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయి, పలు గ్రామాల్లో ఇళ్లల్లోకి వరదనీరు చేరటంతో అర్ధరాత్రి స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సుమారు 20 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచి పోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రాగం పాపయ్య వాగుకు సంబంధించిన బంధం తెగిపోవటంతో మొండికుంట, మల్లెలమడుగు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల వారి ఇళ్లల్లోకి అర్ధరాత్రి వరదనీరు చేరటంతో భయాందోళనకు గురయ్యారు. తుమ్మలచెరువు సాగునీటి వనరుకు సంబంధించిన అలుగు భారీగా పారటంతో కొత్తగూడెం-మణుగూరు జాతీయ రహదారిపైకి వరదనీరు చేరటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అదేవిధంగా అలుగు కాలువ లోతట్టుకు చెందిన సుమారు 100ఎకరాల్లో వరిపంట నీటమునిగింది. భారీ వర్షంతో జనజీవనం స్తంభించింది.

దంచికొట్టిన వాన..

బూర్గంపాడు: బూర్గంపాడు మండల పరిధిలో శనివారం రాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. మండల పరిధిలో 27.8 సెం.మీ వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి పోర్లాయి. గ్రామాలలో డ్రైనేజీలు సక్రమంగా లేకపోడంతో లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కృష్ణసాగర్ పంచాయతీలోని ఉర్లదోసపల్లి గ్రామానికి చెందిన రైతులు తమ పశువులను గ్రామ శివారులోని పోలాల్లో కట్టి వేశారు. రాత్రి కురిసిన అకాల వర్షానికి వాగు పొంగడంతో 36పశువులు మృతి చెందగా 10పశువులు వరద ప్రవహానికి కొట్టుకుపోయాయి. ఒక మేక చనిపొగా మరో మేక కొట్టుకుపోయినట్లు రైతులు తెలిపారు. ఆదివారం ఘటన స్థలాన్ని తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, పంచాయతీ సెక్రటరీ నాగిరెడ్డి పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వాగులు, వంకలు పొంగి పోర్లడంతో పంట పొలాలు చెరువులను తలపించాయి. బూర్గంపాడు-మోరంపల్లిబంజర ప్రధాన రహదారిపై దోమలవాగు మోరీల వద్ద వరద నీరు చేరడంతో రాకపోకలను నిలిపివేశారు.

పలు గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

గుండాల: గుండాల మండలంలో ఎడతెగని వర్షం కురుస్తోంది. భారీ వర్షంతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కిన్నెరసాని, మల్లన్నవాగు, ఏడుమేలికలవాగు, తొట్టివాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో దొంగతోగు, సజ్జలబోడు, నాగారం, కొడవటంచ, మల్లెగుంపు, మంటం లంక, దామరతోగు దొరగుంపు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. కిన్నెరసాని ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కొడవటంచ వద్ద వంతెన నీటిలో మునిగిపోయింది.

లోతట్టు ప్రాంతాలు జలమయం

పాల్వంచ టౌన్: పాల్వంచ పట్టణ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. శ్రీనివాసకాలనీ సమీపంలోని మొర్రేడువాగు ఉధృతంగా ప్రవహించింది. శ్రీనివాస కాలనిలో కిలారు సుబ్బారావు ఇంటితోపాటు పలు ఇళ్ల నడుములోతు నీరు చేరి చుట్టుముట్టింది. జ్యోతినగర్, ఇంది రాకాలనీ, హమాలీ కాలనీ తదితర కాలనీల్లో గుట్టపై నుంచి రాళ్లతో కూడిన వర్షపు నీరు ఉధృతంగా వచ్చింది. కరకవాగు, తెలంగాణనగర్ కూడా వర్షపు నీరుచుట్టుముట్టింది. ఒడ్డుగూడెంలో నివాసం ఉండే రిక్షా కార్మికుడు అఫ్జల్ ఇంటి గోడ కూలి ఇంట్లోని సామానుల మొత్తం ధ్వంస మైంది. బీసీఎం ప్రధాన రహదారిపై రాకపోకలకు కొంత సమయం అంతరాయం కలిగింది. రాతి చెరువు అలుగు వరదతోపాటు వర్షానికి వచ్చిన నక్కలవాగు వరదతో శ్రీనివాసకాలనీ సమీపంలోని పంట పొలాల్లో వరదనీరు ఉధృతంగా ప్రవహించింది.

నీటమునిగిన పంటపొలాలు

చంద్రుగొండ: వర్షాలకు వాగులు, వంకలు పొంగి పంట పొలాలను ముంచెత్తాయి. మండలంలోని సీతాయిగూడెం, బాల్యతండా, రేపల్లేవాడ, అన్నారంతండా గ్రామాల సమీపలోని వాగులు పొంగి పొర్లటంతో సమీపలోని పత్తి, వరి పొలాలు నీట మునిగాయి. దీంతో పాటు ఆయా గ్రామాలకు కొన్ని గంటలపాటు రాకపోకలు నిలిచిపోయాయి. వెంగళరావు ప్రాజెక్టు అలుగు వద్ద ప్రమాదక పరిస్థితి ఉండటంతో నీటిపారుదల ఈఈ వెంకటేశ్వరావు అలుగు వద్ద ఉధృతిని పరిశీలించారు. ఎస్పీ రోహిత్‌రాజు సీతాయిగూడెం వద్ద పొంగుతున్న ఎదుళ్ల వాగులను పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాని స్థానిక పోలీసులను ఆదేశించారు. వరదల సమయంలో అవసరం అయితే తప్ప బయటకు రావద్దని కోరారు.

అన్నపురెడ్డిపల్లిలో..

అన్నపురెడ్డిపల్లి: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొరులుతున్నాయి. అబ్బుగూడెం, వెంకటాపురం, జానీకిపురం గ్రామాలవద్ద వాగులు పొంగి రోడ్లపై ప్రవహించటంతో ఆయా గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు.


పాల్వంచలో కూలిన గోడ


కరకగూడెంలో నీట మునిగిన పంట పొలాలు


గోపాలరావుపేటలో కూలిన ఇల్లు


ఆళ్లపల్లి వద్ద కిన్నెరసాని ఉగ్రరూపం


ఉధృతంగా ప్రవహిస్తున్న తుమ్మల చెరువు


బూర్గంపాడు-మోరంపల్లి బంజర రహదారి

రామయ్యకు వైభవంగా కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం సెప్టెంబర్ 1: భద్రాచలంలోని సీతారామ నగర్ కాలనీలో సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నూతన గృహ ప్రవేశాన్ని పురస్కరించుకుని ఆదివారం ఇంటి యజమాని జి.శ్రీనివాస్ దంపతులు రామయ్య కళ్యాణం నిర్వహించారు. ఈ క్రమంలో శ్రీరామ రథంలో స్వామివారి ప్రచార మూర్తులను రామాలయం నుంచి తీసుకువచ్చి సంప్రదాయ పద్ధతిలో కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, పర్యవేక్షకులు అరుణ్ కుమార్, వైదిక పరిపాలన సిబ్బంది అమరవాది గోపాలకృష్ణమా చార్యులు, లింగాల రామకృష్ణ ప్రసాద్, కె.కిరణ్ కుమారాచార్యులు, ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు, అమరవాది శ్రీకాంత్ ఆచార్యులు, శివరాం, శివ, సాగర్, రాంనర్సయ్య పాల్గొన్నారు.

మిషన్ భగీరథ కార్మికుల సమ్మె


సమ్మెలో పాల్గొన్న కార్మికులు

దుమ్ముగూడెం, సెప్టెంబరు 1: మండలంలోని పర్ణశాల మిషన్‌భగీరథ ప్లాంటు కార్మికులు విధులను బహిష్కరించి ఆదివారం సమ్మెకు దిగారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి పద్మ సమ్మెను ప్రారంభించారు. ఐదునెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రనక, పగలనక అన్ని కాలాల్లోనూ నీటి సరఫరా చేస్తున్న కార్మికులు తిండికి లేక అప్పులు చేయాల్సిన దుస్థితి పట్టిందని తెలిపారు. కార్మికుల సమ్మెతో దుమ్ముగూడెం, చర్ల మండలాలకు ఆదివారం తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జిశ్రీను, సాయిచందు, దాసు, పవన్, సాయిరెడ్డి, పవన్‌రెడ్డి, కళ్యాణ్ పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ అసిస్టెంట్ డైరెక్టర్‌కు ఆత్మీయ వీడ్కోలు


నాగరత్నం దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కొత్తగూడెం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం మెడికల్ కళాశాలలో రెండు సంవత్సరాలు విద్యార్థుల శ్రేయస్సుకోసం అహర్నిశలు కృషి చేసిన అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిన్) నాగరత్నం శనివారం పదవీ విరమణ పొందారు. ఆమె తన ఉద్యోగ జీవితంలో రంగారెడ్డి జిల్లాలో ఉత్తమ ఉద్యోగిగా అవార్డు పొందారు. ఉద్యోగ విరమణ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు ఆమెను ఘనంగా సన్మానించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

ఆళ్లపల్లి, సెప్టెంబర్ 1: ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆళ్లపల్లి మండలంలో ఆదివారం రాత్రి జరిగింది. మండల పరిధిలోని రాయిపాడు గ్రామానికి చెందిన తాటి వసంతరావు ఆళ్లపల్లి నుంచి స్వగ్రామం వెళుతున్న క్రమంలో తీర్లాపురం దగ్గర బైక్ పై నుండి క్రింద పడ్డారు. ఈ క్రమంలో తలకు తీవ్ర గాయం కావడంతో పాటు చెవులో నుంచి రక్త కారడం, కాళ్లు చేతులకు గాయలు అవ్వడంతో, అటుగా వెలుతున్న కొందరు 108కి కాల్ చేయాగా 108 సిబ్బంది, పోలీస్ శాఖ స్పందించారు. ఆళ్లపల్లి పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి, కొత్తగూడెం తీసుకేళ్లేందుకు సంపత్‌నగర్ దగ్గర రోడ్డు లేకపోవడంతో ఇల్లెందు తరలించారు.

ఏఐటీయూసీ మండల కమిటీ

అశ్వారావుపేట, సెప్టెంబర్ 1: అశ్వారావుపేట మండల ఏఐటీయుసీ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సలీం, అధ్యక్ష, కార్యదర్శులుగా పఠాన్ జలాల్, దోమల అనిల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అద్దంకి సాయి ఎన్నికయ్యారు. ఉపాధ్యాక్షులుగా రాములమ్మ, వంట సాల చెన్నారావు, గంధ్రల నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగ ఎస్‌కె రహింతుల్లాహ్, బుడిపూటి సాయి, ఎండీ అసీఫ్, ఉప్పతల వెంకటేశ్వారావు, పడాల సాయి, పురిటి చిలకారావు, కోశాధికారిగ కొనకళ్ల శ్రీను, మరికొందరు సభ్యులుగా ఎన్నికయ్యారు.

చుంచుపల్లి ఏఎస్ఐ ఉద్యోగ విరమణ



ఏఎస్ఐ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు 1: చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ విధులు నిర్వహిస్తున్న దాసరి సంజీవరావు ఉద్యోగ విరమణ సందర్భంగా జిల్లా అధికారులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. సుదీర్ఘకాలం పోలీస్ శాఖలలో పని చేస్తూ తనకంటూ ప్రత్యేక స్థానం పొంది పదవి విరమణ పొందిన సంజీవ్‌రావును, భార్య విజయను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, పోలీస్ అధికారులు ఎస్‌బీ డీఎస్పీ వుల్యా, ఎస్‌బీ-1 నాగరాజు, ఎస్‌బీ-2 సీహెచ్‌శ్రీనివాస్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, కుటుంబ సభ్యులు దాసరి కిషోర్‌కుమార్, నవిత, సతీష్‌కుమార్, స్ఫూర్తి, అభయ్‌దీర, ఆరివ్‌ధైర్య, ఐరద్రితి, దీపిక దాసరి, బంధు మిత్రులు, పోలీస్ సిబ్బంది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లలో అలసత్వం వద్దు: కూనంనేని

కొత్తగూడెం, సెప్టెంబరు 1: ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు, వరదలకు నిర్వాసితులుగా మారుతున్న ప్రజలకు సహాయ చర్యలు అందించడంలో, పునరావాస ఏర్పాట్లలో ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది అలసత్వం వహించవద్దని, అప్రమత్తతతోనే జరిగే నష్టాన్ని నివారించవచ్చని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ముఖ్యమంత్రిని కలిసేందుకు హైదరాబాద్ వెళ్లిన ఆయన అక్కడి నుంచి జిల్లా ఉన్నతాధికారులకు ముంపు సమస్యలపై పలు సూచనలు చేశారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తతతో పని చేయాలని సకాలంలో స్పందించి తగిన చర్యలు చేపడితేనే జరిగే నష్టాన్ని నివారించవచ్చని కూనంనేని సూచించారు.

'తుమ్మలచెరువు రక్షణకు చర్యలు చేపట్టాలి'

అశ్వాపురం, సెప్టెంబరు 1: భారీ వర్షాల నేపథ్యంలో మండలంలో సుప్రసిద్ధ సాగునీటి వనరు తుమ్మలచెరువు రక్షణకు అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య కోరారు. ఆదివారం ఆయన మండలంలోని తుమ్మలచెరువు సాగునీటి ప్రాజెక్ట్, లోతువాగులను సందర్శించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి తుమ్మలచెరువు పరిరక్షణకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత, నెల్లిపాక సింగిల్ విండో చైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కమటం నరేష్, కాంగ్రెస్ నాయకులు ముత్తినేని శ్రీనివాసరావు, రాగం మల్లయ్య, వెంకటరమణారెడ్డి, పొడియం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సేవలు భేష్.. రాత్రి వరకూ అందుబాటులో


ఫోన్‌లో గర్భిణితో మాట్లాడుతున్న డీఎస్పీ

మణుగూరు,సెప్టెంబరు 1: మణుగూరును అతలాకుతలం చేసిన భారీ వర్ష వరదల్లో బాధ్యతాయుతంగా స్పందించి ముందస్తుగా తమ విధులను అందించడంలో ఉత్తమ సేవలందించారు మణుగూరు మండల అధికారులు. శనివారం రాత్రి 10 గంటల నుంచి పలువురితో ఫోన్‌లో టచ్‌లో ఉంటూ మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, తహశీల్దార్ రాఘవరెడ్డి నిరంతరం అప్రమత్తం అయ్యారు. పోలీసు, రెవెన్యూ అధికారులు, సిబ్బందితో పాటు మణుగూరు మునిసిపల్ అధికారి సిబ్బందితో సమన్వయమవుతూ వరద ముంపు ప్రాంతాల వివరాలు తెలుసుకోవడమే కాకుండా గర్భిణీ స్త్రీలు వరదల్లో చిక్కుకున్న విషయం తెలుసుకుని వారి వద్దకు వస్తున్నామని సాయం చేస్తామని ధైర్యం చెబుతూ ఫోన్‌లో వారితో సంభాషించారు. మణుగూరు వాగుమల్లారం, సుందరయ్యనగర్ ప్రాంతాల్లో ఇద్దరి మహిళలను రెస్క్యూ టీమ్‌ల సహకారంతో పునరావాసకేంద్రాలకు తరలించారు. మామిడి తోట గుంపు ప్రాంతంలో 13 కుటుంబాలు కోడిపుంజుల వాగు ప్రవాహంల్లో దిగ్బంధం అయ్యారని 'ఆంధ్రజ్యోతి' తెలుపగా డీఎస్పీ వెంటనే స్పందించి ఎస్ఐ మేడ ప్రసాద్‌ను అక్కడికి హుటాహుటిన పంపి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలింపజేశారు. శనివారం తెల్లారు జామునుంచి మధ్యాహ్నం వరకు సేలందించారు. అంతే కాకుండా వరదల ముంపు ప్రాంతాలను స్వయంగా పరిశీలించేందుకు మణుగూరు విచ్చేసిన కలెక్టర్ దినేష్ పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్‌లతో పాటు డీఎస్పీ రవీందర్ రెడ్డి, తహశీల్దార్ రాఘవ రెడ్డిలు పర్యటించి సంబంధిత వివరాలను తెలిపారు. వారి ఆదేశాల ప్రకారం వరద బాధిత కుటుంబాలకు సేవలందించారు. పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులను బాధితులకు కల్పించడంలో సఫలీకృతులయ్యారు. తమ సిబ్బందితో సేవలందించడంతో పాటువారు కూడా స్వయంగా సహాయక చర్యల్లో పాల్గొనడం హర్షనీయంగా మారింది. 14 టైర్స్ లారీ ఓనర్లు సుందరయ్య నగర్ ప్రాంతంలోని నిరుపేద కుటుంబాలకు చెందిన 500 మందికి భోజన వసతిని అందజేశారు.అంతే కాకుండా కాళీమాత ఏరియా, శ్రీశ్రీ నగర్, , మామిడి తోట ఎక్సలెంట్‌పాఠశాల ఏరియాల్లో మేదర్ బస్తీల్లో నిరుపేదలకు భోజన ప్యాకెట్ల సదుపాయన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో 14 టైర్స్ లారీ ఓనర్లు పాల్గొన్నారు.